కథా నిలయం
వ 3446
శ్రీకాకుళం

# వయస్సు

- ఆంధ్రప్రభ, 2-2-1977

"జీవితంలో భావుకత చోటు చేసుకుంటే.....
మనిషిలో అనుభూతులకు కొదవుండదు.
మనస్సుకు వయస్సురాదు."

"నావల్ల కాదులేరా, చైతన్యా! ఇంతటితో ఆ సంభాషణ ఆపుచెయ్యి." వంగి సిగరెట్టు నుసి ఆష్ట్రేలో విదిలిస్తూ అన్నాడు భవానీ ప్రసాద్.

అతని కళ్ళల్లో కావాలో వద్దో తెలుసుకోలేని అయోమయావస్థలాటి ఒక చిత్రమైన భావం కదులుతోంది.

"లేదు భవానీ! నాకు నమ్మకముందిరా. ఆ అమ్మాయితో నీ జీవితం చాలా అందంగా ఉంటుంది."

తను వ్రాస్తూ ఆపేసిన థీసీస్ పక్కనపెడుతూ విచారంగా నవ్వాడు భవాని.

"ఎక్సపెరిమెంట్ చెయ్యడానికి ఇది జీవితంరా!"

"వెల్. నీ మూడ్స్ బాగాలేవు. ప్రస్తుతానికి వదిలెయ్. నిదానంగానే ఆలోచించు. అదృష్టాన్ని అనుమానాలతో దూరం చేసుకోకు" లేచాడు చైతన్య.

భవాని నవ్వాడు.

"వెళ్ళకు కూర్చో. అంత గట్టిగా చెబుతున్నావు. ఆ అమ్మాయి గురించి నీకేం తెలుసునని?"

"నిజమే. నాకేం తెలియదు. నాకు అలా అనిపించిందంతే. పైగా ఆ అమ్మాయి వయస్సు నిన్ను సుఖపెడుతుందని....."

"భలేవాడివే! ఏ వయస్సయితే నాకు అభ్యంతరంగా ఉందో అదే నీకు ప్రత్యేకంగా కనిపిస్తోందా?"

ఈమారు కాస్త పెద్దగానే నవ్వాడు భవాని. కానీ, చైతన్య నవ్వలేదు. మౌనంగా గది బయట యూకలిప్టస్ చెట్ల సందులోనుండి చిత్రంగా వికరణం పొందే సూర్య కిరణాలవంక చూస్తున్నాడు.

"ఏం మాట్లాడవు?" రెట్టించాడు భవాని.

"చెప్పానుగా? ఎందుకో నాకు అలా అనిపించింది. ఆ కళ్ళలో అపురూపమైన భావం ఉంది.... తన వాళ్ళకు ఆత్మార్పణ చేసుకోగల భావమది. ఆమె ముఖంలో ఒక రకమైన ప్రసన్నత....."

"కవిత్వం చెబుతున్నావు నువ్వు."

సన్నగా నవ్వాడు చైతన్య.

"కవిత్వం జీవితం కాదు. కానీ, భవానీ! జీవితంలో కవిత్వం చోటుచేసుకుంటే, ఆ అనుభూతిని అక్షయం చేసుకోగలిగితే.... ఆ జీవితం నిత్య యవ్వనంగానే వుంటుందిరా. అలాంటి జీవితంకొరకే నేనూ ఎదురు చూస్తున్నాను." అలా అనేసి మరి స్నేహితుడు చెప్పబోయేది వినకుండా లేచి గది బయటకు నడిచాడు. అతనిని వారించలేదు భవాని. స్నేహితుని ఆఖరిమాటల్లో అర్థాలకొరకు వెదుకుతూ అతనిని అనుసరించాడు.

"ఎక్కడికి?"

ఆగిపోయిన తన చేతి వాచీవంక చూసుకున్నాడు చైతన్య.

"టైమెంత?"

"తొమ్మిదయింది."

"అయితే, అలా హోటల్ కెళదాం పద."

* * * * *

"నువ్వు మరోలా అనుకోకపోతే నాకు ఇలా చెయ్యాలని ఉంది."

తినబోతున్న ఇడ్లీముక్క మరలా ప్లేట్లో వదిలి కళ్ళు పైకెత్తి చూచాడు చైతన్య.

"నువ్వు మాధవిగారిని చేసుకో. నేను.... నేను.... ఆమె అత్తకూతురు సహిత...."

చటుక్కున తల ఎత్తి చురుగ్గా చూసాడు చైతన్య.

"అంటే నీ ఉద్దేశం....?"

"నువ్వు మరోలా అర్థం చేసుకోవద్దని ముందే చెప్పాను."

చైతన్య చాలాసేపు మాట్లాడలేదు. వాళ్ళిద్దరు టిఫిన్ తిని, కాఫీ తాగడం కూడా పూర్తి అయింది.

"ఇంతకీ నువ్వు జవాబు చెప్పలేదు." అతి సాధారణంగా అడుగుతున్నట్లు అడిగాడు భవాని.

"అంత అవివేకపు ప్రశ్న నువ్వు వేస్తే దానికి నేనేం జవాబు చెప్పేది? నీ కనుకున్న అమ్మాయిని నేను చేసుకుంటానని చెప్పడానికి నేను...."

"ఆగు. మాట్లాడకు నన్ను చెప్పనీ."

మధ్యలోనే స్నేహితుడిని ఆపేశాడు డాక్టర్ భవాని. చైతన్య చెప్పబోయేదేమిటో అతనికి తెలిసిపోయింది.

"పెళ్ళిచూపులు, పెళ్ళిమాటలు ఎన్నో జరుగుతాయి. ఆ తరువాత జీవితంలో వాళ్ళు మనకు ఎదురుపడవచ్చు. అంతమాత్రంచేత ఆ భావం ఉంటుందా? నా కనుకున్న అమ్మాయితో నీకు పెళ్ళి కాకూడదనే సంప్రదాయ మూర్ఖత్వం ఇంకా మనలో రాలేదు." కాస్త ఆవేశంగా అంటున్న భవాని, చప్పున మెత్తగా మారిపోతూ అన్నాడు.

"కాదనకురా, చైతన్యా! మనం పదేళ్ళు కలిసి చదువుకున్నాం. ఈ పదేళ్ళలో నీకింతగా నచ్చిన అమ్మాయి నాకు కనపడలేదు."

అంతా మౌనంగా విన్న చైతన్య లేచి సింక్‌లో చేతులు కడుక్కుంటూ తల అడ్డంగా తిప్పాడు.

"ఊహుఁ, కాదులే..... అది బాగుండదులే."

"ఎవరికి బాగుండదు?" తల ఎత్తి స్నేహితుణ్ణి విసుగ్గా చూస్తూ అడిగాడు భవాని.

"నాకే!" నింపాదిగా జవాబు చెప్పి, బేరర్ బిల్లు తెచ్చిన ప్లేట్లో రెండు రూపాయల నోటు పడేసి, నాలుగు సోపు గింజలు నోట్లో వేసుకుని నమలసాగాడు.

"వేగ్గా మాట్లాడకు. కాస్త నీ మనస్సు విప్పి మాట్లాడు చైతన్యా! నేనెలాగూ ఆ మాధవిగారిని చేసుకోబోవడం లేదు."

"ఏం? ఎందుకని?"

"ఎన్నిసార్లు చెప్పాలి? ఆ అమ్మాయి వయస్సు పాతిక. నాకు టీనేజ్ గర్ల్ కావాలి."

"నిజమే, నే వొప్పుకుంటున్నాను. నాది అత్యాశే, అన్యాయమే. అలా అని రాజీ పడలేను. నాకుండేది ఈ ఒకే ఒక్క జీవితం."

పెదాలు విడీవిడకుండా నవ్వాడు చైతన్య.

"ఆ పదహారేళ్ళ అమ్మాయికి కూడా ఉండేది ఒకే ఒక్క జీవితం. పాతికేళ్ళ పైబడ్డ వాడిని ఆ పిల్ల ఎందుకు చేసుకోవాలి?"

"నా అత్యాశను ఆదరించి అంగీకరించే వాళ్ళనే చేసుకుంటాను."

స్నేహితుని పుల్ల విరుపు జవాబుకు నవ్వుకున్నాడు చైతన్య.

"వెల్! ఇది నీ జీవితం. నీ ఇష్టం. కానీ నా జీవితాన్ని నువ్వు శాసించడం...."

చప్పున్న స్నేహితుని చేతిమీద చెయ్యివేసి అర్ద్రస్వరంతో పలికాడు భవాని.

"కాదురా చైతన్యా! నేను శాసించడం లేదు. నీకింతగా నచ్చిన అమ్మాయి నీకు మరి జీవితంలో కనిపించదేమోనని ఆరాటపడుతున్నాను."

"ఆల్రైట్! ఇది నిమిషాలమీద తేలే సమస్య కాదు. పద."

భవానీ జవాబు వినకుండానే బయటకు నడిచాడు చైతన్య.

"ఓ.కె. అయితే, ఈరోజే వాళ్ళకు ఉత్తరం వ్రాయబోతున్నాను."

"ఏమని?"

"మాధవిగారికి నేను తగనని" తగ్గు స్వరంతో అన్నాడు. అక్కడ జనం చెల్లా చెదురుగా ఎవరి సమస్యలలో వాళ్ళున్నారు. వీళ్ళ రహస్యాలు వినే తీరిక అక్కడ ఎవరికీ వున్నట్లు లేదు.

"మరి సహిత సంగతి?" పక్కగా దూసుకుపోతున్న లారీనుండి భవానిని పక్కకు లాగాడు చైతన్య.

"అది ఇప్పుడు వ్రాయడం మర్యాదగా ఉండదేమో!"

"మరెప్పుడు వ్రాస్తావు?" చిలిపిగా నవ్వుతున్న చైతన్యకు మరింత చిలిపిగా జవాబిచ్చాడు భవాని.

"నీ పెళ్ళిమాటలు మాధవిగారితో సంప్రదించినప్పుడు."

వాళ్ళ పక్కగా మరో లారీ దూసుకుపోయింది.

* * * * *

"సహిత బాగుందా అన్నగారూ?"

పాతికేళ్ళ అవివాహిక జీవితంలో అనుభూతులన్నీ కరిగిపోయి, జీవితమందిస్తున్న అనుభవాల రాపిడిలో మనసు మొద్దుబారిపోయి, అమాయకత్వం, కరిగిపోతున్న కాలంలో కలిసిపోయి, అనురాగం ఆవిరిగామారి, కేవలం భావ స్పందన లేని మెషీన్‌లా మిగిలిపోయిన ఆమె, తనకెలాటి అనుభూతులనూ పంచిపెట్టలేదని తను తిరస్కరించిన మాధవి ఎదురుగా నిలబడి... 'సహిత బాగుందా, అన్నగారూ?' అని అడుగుతోంది.

తృణీకరించిన అదృష్టం ఎదురుగా నిలబడి చిరునవ్వు నవ్వుతోంది.

"అన్నగారూ మీరేదో ఆలోచిస్తున్నట్టున్నారు."

ఉలిక్కిపడ్డాడు భవాని.

"సహితను కూడా తీసుకురావలసింది."

"ఆ! .... ఆఁ ...."

తను తాగేసిక కప్పు తీసుకుని ఆమె వెళ్ళిపోతోంది.

చప్పున స్పృహలోకి వచ్చాడు భవాని.

"మాధవిగారూ! చైతన్య ఎప్పుడొస్తాడు?"

"ఈపాటికి రావలసిందే. ఎప్పుడూ ఆయనింత ఆలస్యం చేసింది లేదు. ఇన్‌స్టిట్యూట్‌లో ఏదో అదనపు పని తగిలుంటుంది."

తన గుండెలమీద చేదు జ్ఞాపకాలు ఛెళ్ళున కొడుతున్నాయి.

* * * * *

'ఈ మగాళ్ళ సంగతి ఎవరికి తెలియదని? ఇంత పొద్దుపోయి వస్తే ఆపాటి అర్థం చేసుకోలేకపోను.' పెద్దవాళ్ళు నేర్పిన చిలకపలుకులవి.

తల విదిలించాడు భవాని.

* * * * *

కాని, ఎంత విదిలించినా ఆ జ్ఞాపకాలు తనను వదలడం లేదు.

మరల మౌనంలోకెళ్ళిపోయిన అతనిని, అతని మానానికి వదిలేసి నిశ్శబ్దంగా వెళ్ళిపోయిందామె.

ఆమె నిష్క్రమణ అతనిలో ఆమె తాలూకు జ్ఞాపకాలను రేపుతోంది. ఆనాడు

తను వ్రాసిన ఆ ఉత్తరంతో ఆమె తన జీవితప్రాంగణంలోకి అడుగుపెట్టకుండానే నిష్క్రమించింది.

"మాధవిగారికి,

మన్నించాలి. మీరు మా స్నేహితుడు చైతన్యకు చాలా నచ్చారు. మీరు బహుశా మా చైతన్యను చూసుండరు. మీకు అభ్యంతరం లేకపోతే మరలా మేమిద్దరం ఒకసారి వస్తాము. మీ సహితగారికి అభ్యంతరం లేకపోతే ఈమారు ఆమెను చూడడానికి నేను వస్తున్నానని చెప్పండి."

సహిత.... సహిత.... సహిత. ఆ తరువాత ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు లేకుండానే సహిత తన భార్య అయింది. తన భాగస్వామిని అయింది. కాని, ఆమె మనస్సునే తను గెలుచుకోలేకపోయాడు.

* * * * *

మధురంగా కాస్త హెచ్చు స్థాయిలో కొన్ని నెలల పసిపాప ఏడుస్తున్న సవ్వడికి మరల ఈ లోకానికి వచ్చాడు భవాని.

"మీరు ఒంటరిగా ఫీలవుతున్నట్లున్నారు. మీరు వచ్చినట్లు ఆయనకు తెలప డానికి ఫోన్ చెడిపోయింది. నాకు ఇరవై నాలుగు గంటలూ వీడితోనే సరిపోతుంది." ఆఖరి మాటల్లోని విసుగు వెనక యెంత అపురూపమైన భావం!

బలవంతాన నోరు విప్పాడు భవాని.

"మీరు ఏదైనా ఉద్యోగం చెయ్యవలసింది" అలా అడిగాక అది యెంత అసందర్భపు ప్రశ్నో అతనికి బాగా బోధపడింది.

ఆమె తన ఒడిలో అప్పుడే నిద్రలో మునిగిపోయిన కొడుకువంక అపేక్షగా చూస్తూ అంది.

"ఇంతకంటే నాకు మరే ఉద్యోగమూ వద్దు అన్నగారూ! అవసరమయితే తప్ప దనుకోండి. కానీ, ఆ అవసరం నాకీ జన్మకు రాకూడదని ప్రార్థిస్తున్నాను" అసంకల్పితంగా ఆ బిడ్డను గుండెలకత్తుకుని చప్పున సిగ్గుపడిపోయింది మాధవి.

* * * * *

'నేను విన్నది నిజమేనా సహితా?'

'ఆఁ!' ఆ కళ్ళలో తను కోరుకునే అపురూపమైన భావం లేనేలేదు.

'అమ్మ దొంగా! నాకు చెప్పనేలేదు కదూ?'

'ఏముంది ఘనకార్యం చెప్పడానికి!' అలా అన్న ఆమె కళ్ళలో ఆ నిర్లక్ష్యం కాకుండా చిలిపితనం ఉంటే ఎంతో బాగుండేది.

మామూలుగా రోజూ అన్నం తింటున్నట్టో.... మామూలుగా స్నానం చేస్తున్నట్టో మాతృత్వం కూడా అతి సామాన్యమైన విషయంగానే ఉందామెకు!

* * * * *

"అన్నగారూ! మరలా మీరు ఆలోచనల్లో పడిపోయారు. లేవండి భోజనం చేద్దురుకాని! ఆయనకేదో పెద్దపనే తగిలుంటుంది...."

భోజనం చేస్తూ అప్పుడే గుర్తొచ్చినట్టు తల ఎత్తి అడిగాడు భవాని.

"మీరూ....."

"ఆయనను రానివ్వండి. ఆయన ఒక్కరే భోజనం చేయలేరు."

ఆమె జగ్గులోని నీళ్ళను గ్లాసులోకి వంచుతూ అంది.

* * * * *

'ఏమనుకోకు నాయనా సహిత చిన్నపిల్ల. నిద్రకు ఆగలేదు. భోజనం చేసి పడుకుంది.'

ఏడు గంటలకే ఇంటికి వచ్చినా, తనకు అందేది అత్తగారి వడ్డన, దానితోబాటు జుగుప్సాకరమైన ఈ క్షమాభిక్ష.

* * * * *

"ఏమండీ, కూర బాగాలేదా? అన్నం తోసేస్తున్నారేం?"

ఉలిక్కిపడ్డాడు భవాని. తను అసంకల్పితంగా అత్తగారి సానుభూతితో ఒళ్ళు మండి చేసినపనినే ఈనాడూ చేస్తున్నాడు.

* * * * *

'ఈ రోజు నేను ఆరుబయట భవానీతో పడుకుంటాను. నువ్వు లోపల ఒంటరిగా పడుకోగలవా?'

"అమ్మో! ఒంటరితనం సంగతి దేవుడెరుగు. మిమ్మల్ని చూసి, మీతో మాట్లాడి

అప్పుడే పన్నెండు గంటలు దాటిపోయింది. ఇక మీకు దూరంగా ఉండడం నా వల్ల కాదు బాబూ!"

సన్నగా, రహస్యంగా వినబడుతున్న మాటలవి.

* * * * *

సహితకూడా రాత్రిళ్ళు తనలో ఒదిగి, తనని ఇంకెవరో ఎత్తుకుపోతారేమోనన్నంత గాఢంగా హత్తుకుని పడుకుని నిద్రపోతుంది. ఆమె చర్యలో భావం భాష ఇదే కావచ్చు. కానీ.... అలా ప్రియమైన వారి నోటివెంట, అదీ భాగస్వామి నోటివెంట వినడం, ఆ మాట్లాడేటప్పుడు కంటిపాప కదలికల్లో, లేత పెదవుల చిరునవ్వుల్లో ఆ అనుభూతిని ఆస్వాదించడం.... అది ఎంత మధురంగా ఉంటుంది!

"మేమిద్దరం విడిపోయి సంవత్సరం పైనే అయింది. చదువుకునే రోజుల్లో ఒకరి కొకరంగా బతికి, ఇలా పెళ్ళిళ్ళు కాగానే జీవితంలో పడి, స్నేహితుల్ని మరచిపోవడం చాలా అన్యాయం మధూ! అయినా, ఒక సంవత్సరం యెడబాటు మాకు తప్పలేదు. ఇప్పుడు కూడా దేవిగారు అనుగ్రహించడం లేదు."

మాధవి నవ్వినట్లుంది.

"అదే మీ సహిత వచ్చుంటే, నన్ను ఒంటరిపక్షిని చేసి వెళ్ళుండేదానివి కదూ?"

ఈ మారు నవ్వుతూనే జవాబు చెబుతోంది మాధవి.

"ఎప్పటికీ కాదు చైతూ. 'అమ్మాయ్! నీకెలాగూ అన్నగారు తోడు రాలేదు. నన్నెందుకిలా నా భర్తనుండి విడదీస్తావు' అని నిలదీసేదాన్ని. పోనీలెండి. ఈ రోజుకి మీకు శాంక్షన్ చేస్తున్నాను వెళ్ళండి."

భార్యాభర్తలమధ్య కొన్ని చిలిపి సరసాలు ఎంత తమాషాగా ఉంటాయి! భార్య చేత ఏకాంతంలో పేరెపెట్టి పిలిపించుకోవడంలో ఎంత మాధుర్యముంది!!

* * * * *

ఇంకా పౌర్ణమి రావడానికి రెండు రోజులుంది. కాని, రాత్రి పదకొండు గంటలు దాటిందేమో చంద్రుడు నడినెత్తిన చల్లగా ప్రయాణం చేస్తున్నాడు తన కిరణాలతో లోకాన్ని చల్లబరుస్తూ.

టెంకాయ ఆకుల గలగలధ్వనులు, పసిబిడ్డ అప్పుడప్పుడూ చేస్తున్న ఏడుపు

శబ్దాలు వింటూ మౌనంగా వెల్లకిలా పడుకుని వున్న చైతన్య భవానీవైపు తిరిగి మోచేతి మీద బరువు ఆన్చి, అరచేతిమీద తల వాల్చుకుని స్నేహితునివైపు రెండు క్షణాలు చూసి అన్నాడు.

"చెప్పు భవానీ, ఇప్పుడు చెప్పు. నువ్వేదో చెప్పాలని ఈ రోజు నా దగ్గరికి వచ్చావు."

తెల్లబోయాడు భవాని.

"అదేమిటి?"

చైతన్య రెండో చెయ్యి స్నేహితుని చెయ్యి మీద వేశాడు.

"నిజం చెప్పు భవానీ, నీకు నాతో ఏమీ చెప్పాలని లేదా?"

భవాని మాట్లాడలేదు.

"చూడు భయ్యా! నేననుకోవడం లేదు. మనిద్దరికి పెళ్ళయినంత మాత్రాన మన స్నేహం ఒక మెట్టు దిగిపోయిందనీ... మనకంటూ రహస్యాలు మన స్వంతంగా మిగిలిపోయాయనీను. ఏమంటావు?"

ఈసారికూడా భవాని మాట్లాడలేదు.

"ఒరే. నీ ఉత్తరాలలో సన్నగిల్లిన జీవం, ఇప్పటి నీ కొత్తరకపు ముభావం నాకు నువ్వు చెప్పకుండానే కొన్ని కథలు చెబుతున్నాయి. అసలు నీ ఉత్తరాలు చూశాక నేనే నీ దగ్గరికి రావాలనుకున్నాను. కాని, సెలవు దొరకలేదు. పోనీ, నువ్వే వచ్చావు..."

భవాని ఈసారికూడా మాట్లాడలేదు. కానీ, చైతన్యకు మరింత దగ్గిరగా జరిగి తన చేయి చైతన్య నడుముమీద వేశాడు. అంతవరకు తెరుచుకుని వున్న అతని కళ్ళు ఆ వెన్నెల మసకకాంతిలో మూసుకోవడం చైతన్య గమనించాడు.

"రేయ్ భవానీ, మనిద్దరం ఈనాడు డాక్టరేట్స్ సంపాదించి వుండొచ్చు. మన కంటూ విడిగా సంసారాలేర్పడి వుండచ్చు. వాటి మాధుర్యం వాటిది. అలా అని స్నేహంలో నువ్వు దూరం పెంచుకోవద్దని నిన్ను కోరుతున్నానురా."

"చైతన్యా!"

"ఓ.కె. ఏదైనా చెప్పు." చైతన్య స్వరంలో మార్పు.

"ఏదో చెప్పడానికి నీ దగ్గరికి నేను రాలేదు. నా గురించి, సహిత గురించి చెప్పడానికే వచ్చాను" అని నసిగి....

"చైతన్యా! నేను పొరబడ్డానేమో ననిపిస్తూందిరా!" అన్నాడు.

"అంటే?"

"ఏం లేదు కానీ, నా అంచనాలు తారుమారయినందుకు మాత్రం చాలా రెస్ట్‌లెస్‌గా వుంది."

"చెప్పు"

"నేను అనుకున్నాను, వయసు దాటిన అమ్మాయిలో కోరికలు చచ్చుబడిపోయి వుంటాయనీ..... అనుభూతులనేవి అసలు మిగలవనీ, కేవలం సంఘం కబంధహస్తాల నుండి తనను రక్షించే ఒక మగవాడు కావాలి కనుక పెళ్ళి చేసుకుంటారనీ... ఇంకా చాలా... చాలా! కానీ, చైతన్యా! మాధవిగారిలో ఆ చైతన్యం ఇంకా వున్నందుకు నాకు అసూయలేదు కారణం ఆ చైతన్యాన్ని అందుకునేవాడిని నా స్నేహితుడివే గనుక. కానీ, సహిత సంగతే నాకు తల బద్దలుకొట్టుకున్నా అర్థం కావడంలేదు."

"ఏం... నువ్వంటే ఆ అమ్మాయికి ఇష్టం లేదా?" చైతన్య కంఠంలో తొందర, ఆత్రుత.

"ప్రేమ వుంది. ఇష్టముంది. కానీ, ఒక్కొక్కమారు నాకే ఆమె ప్రేమమీద అప నమ్మకం కలుగుతూంటుంది."

"ఎవరైనా సరదాకి మా ఇద్దరినీ జోక్‌చేస్తే నవ్వదు. ఎవరైనా ఆమె వరస బంధువులు నన్ను ఎగతాళి చేస్తుంటే, తను వాళ్ళతో కలసి నన్ను ఉడికించదు; లేదా నా వైపు సపోర్టింగ్‌గా మాట్లాడదు. తనకు సంబంధించిన విషయం కాదన్నట్లు ముభావంగా ఉండిపోతుంది. నేను ఊరెళ్ళేటప్పుడు, ఆమె ముఖంలో నేను వెళ్ళి పోతున్నాననే దిగులుకాని, విషాదంకాని నేనింతవరకు చూడలేదు. కనీసం వాకిటివరకు వచ్చి అయినా సాగనంపదు. నేను రావడం, పోవడంలో ఆమెకేమీ తేడా వుండదు. సినిమాకయినా, షాపింగ్‌కయినా నాతో ఒంటరిగా రాదు. ఎవరినో తోడు తెచ్చు కుంటుంది. నేను రోజూ తనకు పూలు తెస్తానని తెలుసు. అయినా, నేను తెచ్చేలోపలే ఎవరో కొని తెచ్చిన పూలు పెట్టేసుకుంటుంది. నాకిష్టమైన కూర ఆమె చేతిమీదుగా వడ్డించాలని.... నా కిష్టమైన చీర కట్టుకుంటే చూడాలని ఉండడం అన్యాయమా? ఒక్కోసారి ఆమె వ్రాసిన ఉత్తరాలు చదువుతుంటే ఏడుపొస్తుంది. ఎవరన్నా చదువు తారేమో అన్నట్టు కొన్ని పరిధుల్లో బిగించుకుని వ్రాసినట్టు వుంటాయా ఉత్తరాలు. ఆఖరుకు నా బిడ్డకు తను తల్లి కాబోతున్న ఆనందం కూడా లేదురా ఆమెలో."

ఇక నిలవలేనట్టు ఒక్క గుక్కలో తన కష్టాలన్నీ చెప్పుకుంటున్న స్నేహితుని స్వరం ఆఖరి మాటల్లో ఆర్ద్రంగా మారిపోవడంతో కదిలిపోయాడు చైతన్య.

"ఆగు, ఆగురా, భవానీ! నువ్వా అమ్మాయిని అర్థం చేసుకోవడం లేదంతే."

"ఇంకా ఎన్ని రోజులురా? అది బెరుకో, భయమో, సంకోచమో, నిర్లక్ష్యమో అర్థంకాక చస్తున్నాను."

"అదే... అదే... నువ్వు చెప్పావే అదే.... ఆ అమ్మాయిని ఫ్రీగా నీతో మసలనివ్వడం లేదు. ఎవరో, ఏదో అనుకుంటారనే సంకోచభావం, ఇంకా పరిణతి చెందని ఆమె పసిభావాలు.... అవే ఆ అమ్మాయిని అలా నిలబెట్టాయి. ఆమె మారుతుంది. నాకు నమ్మకముంది. కానీ, నువ్వు ఎదురు చూడాలి."

"ఇంకా ఎన్ని రోజులు?"

"చెబుతాను. అసలు నువ్వామెను మార్చడానికి ప్రయత్నించావా?"

భవాని మాట్లాడలేదు.

"అసలు నీ కోర్కెలను ఆమెకు తెలియజేశావా?"

చప్పున కళ్ళెత్తి చురుగ్గా, రోషంగా చూశాడు భవానీ. ఆ చూపులు క్రమేపీ దయనీయంగా, శూన్యంగా మారిపోయాయి.

* * * * *

'అలా చీకటిలో నిశ్శబ్దమైన రోడ్లమ్మట, చల్లగా తలలు విరబోసుకున్న చెట్ల మధ్యగా కారులో ఒకరినొకరు అంటుకుని..... అబ్బ సహితా! ఆ అనుభూతిని పంచుకోవాలనుంది. ఈ ఒక్కసారి రా, సహితా!' అంటే...

'అన్నీ మీవి వెర్రి కోరికలే!' అని తోసేసి వెళ్ళిపోయే సహిత... 'పగలు పడకలో కూర్చొనడం.... ఎవరైనా నవ్వరూ?'

'రాత్రిళ్ళు ఎందుకు నవ్వరో!'

'ఏం వింతమనిషి బాబూ! భార్యాభర్తలం రాత్రిపూట...'

'ఓ! పగలు మనం భార్యాభర్తలం కామా?'

'నీతో నేను వాదించలేను' అని నిర్లక్ష్యంగా వెళ్ళిపోయే సహిత.... చిలిపిగా చదువుకుంటున్న పుస్తకాన్ని లాగేసి రెండు చేతులమీద ఎత్తి బెడ్‌మీద వేసి సున్నితంగా చుంబిస్తే.... ఆ మాధుర్యం! కానీ, తను కుంచించుకుపోయేలాగ జుగుప్సగా చూసి, 'అంత ఆత్రమెందుకూ?' అని నాలుగు రోజులు మాట్లాడని సహిత...

'కాశ్మీరా? భలేవారే? ఇప్పుడెందుకు అంత దండుగ ఖర్చు?'

'దండుగ ఏముంది, సహితా! ఇప్పుడు కాకపోతే ఎప్పుడెళతాము? మహా అయితే రెండు, మూడు వేలవుతుంది.'

'రెండు, మూడు వేలే!' ఆమె ఆశ్చర్యంతో తనకు తిక్కరేగి... 'ఏం? ఒక్క పట్టుచీర రెండువేలుపెట్టి కొనడం లేదా?' అంటే కాశ్మీర్ ఊహకూడా భయంకరంగా మారేట్టు అలిగి నానా హంగామా చేసిన సహిత....

ఏకాంతంలో పేరుపెట్టి పిలిపించుకోవాలనే కనీసపు కోర్కెను తీర్చడానికి ఆసక్తి చూపించని సహిత...

కేవలం తినాలి కాబట్టి తింటూ, భార్యాభర్తలం కనుక రాత్రిమటుకు ఒకే రూములో కలుస్తూ... ఛీ!... ఛీ! ఇంత జుగుప్సాకరమైన ఊహలలో ఉన్న సహిత, ఇలాంటి సహితనెలా మార్చాలి?

* * * * *

అయోమయంగా చూస్తున్న స్నేహితుణ్ని విచారంగా చూస్తూ మరలా చైతన్యే అన్నాడు.

"నిరాశ పడకురా భవానీ! ఏ అనుభూతులనైతే నువ్వు ఆమె దగ్గరనుండి ఆశించావో అని ఇంకా సహితలో ఉద్భవించనేలేదు. దాంపత్య జీవితం కొరకు, మాతృత్వం కొరకు మాధవి నిరీక్షించినంతగా సహిత నిరీక్షించకుండానే ఆమె పదహారేళ్ళకే గృహిణి అయింది. పదిహేడేళ్ళకే మాతృమూర్తి కాబోతోంది. దాంపత్య జీవితం కానీ, మాతృత్వం కానీ సహితకు అందని పళ్ళుగా నిలిచిపోలేదు. ఆ నిరాశను కానీ, నిరీక్షణను కానీ ఆమె అనుభవించకముందే ఆమె దోసిట్లో ఒలిచి పెట్టబడిన ఈ జీవితం విలువ ఆమెకింకా అర్థం కాలేదు. ఇంకా.... ఇంకా.... ఏం చెప్పేదిరా, భవానీ!.... నువ్వు ఆమె మారేవరకు ఎదురుచూడాలి. ఆమె తప్పక మారుతుంది."

"ఎప్పుడు? ఈ మాధుర్యం చెదిరిపోయాకా?"

చైతన్య దగ్గర స్నేహితునికి జవాబిచ్చే శక్తి లేదు.

దిగంతాల నాక్రమించిన వెన్నెలదారులను చీల్చుకుని ఒక చల్లటి పిల్ల తెమ్మెర వాళ్ళమీదుగా వెళ్ళింది. కానీ, అవివేకంతో చేసుకున్న నిర్ణయాలు తన జీవితాన్ని చిత్రహింస పెడుతున్నాయని భావించి పశ్చాత్తాప పడుతున్న భవాని... తన స్నేహితుని భావుకతకు జరిగిన అన్యాయానికి అశాంతితో అల్లాడిపోతున్న చైతన్య.... ఇద్దరూ ఆ చల్లటి హాయిని అనుభవించే స్థితిలో లేరు.

"పోనీ... పోనీ... ఇంకా ఎన్ని సంవత్సరాలు ఆగాలో అదైనా చెప్పు చైతన్యా!"

"మాధవి వయస్సెంత?"

దయనీయంగా, నిరామయంగా చూస్తున్న స్నేహితుని చూపులను తట్టుకోలేని వాడిలా చప్పున ఇద్దరికీ దుప్పటి కప్పాడు చైతన్య.